ట్రూఅప్ భారం రూ.163 కోట్లు

- సామాన్యులపై బాదుడు - ఈ నెల నుంచి పెరిగిన బిల్లులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం భారాన్ని మోపింది. గత 9 నెలలుగా ట్రూ అప్ (సర్దుబాటు) చార్జీలు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే.. దీనికి అదనంగా ఈ నెల నుంచి మరికొంత వసూలు చేస్తున్నారు. ఈనెల నుంచి వచ్చిన విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి...

కేంద్ర ప్రభుత్వ సూచనలతో సామాన్యులపై ఇప్పటికే వివిధ రూపాల్లో భారాలు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరుతో ఈ నెల నుంచి మరింత భారాన్ని మోపింది. ఎపిఈఆర్‌సి నుంచి రెండో విడత సర్దుబాటు చార్జీలు వసూలు చేసేందుకు ఇప్పటికే అనుమతి వచ్చింది. దీంతో ఇప్పటికే వేస్తున్న విద్యుత్ భారానికి అదనంగా మరికొన్ని నెలల పాటు ట్రూఅప్ పేరుతో విద్యుత్ భారాన్ని మోపాయి. 2021-22 సంవత్సరానికి సంబంధించి డిస్కంకు వచ్చిన నష్టాలు పూడ్చుకునేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేశారు. 2021-22 ఏప్రిల్‌లో వాడిన యూనిట్లపై ట్రూ అప్ భారాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో కలిపారు. ఏ నెలకు సంబంధించిన బిల్లును ఆ నెల వసూలు చేయనున్నారు. అప్పట్లో అధికంగా విద్యుత్ వాడకం ఉంటే.. ప్రస్తుతం అందుకు సంబంధించిన భారం సామాన్యులపై పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 11 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ, వాణి, పారిశ్రామిక భారం వేశారు. నికరంగా 12.50 లక్షల మందిపై సుమారు రూ.163 కోట్ల మేర భారం పడింది. 2019 ఏప్రిల్ తర్వాత తీసుకున్న విద్యుత్ కనెక్షన్లకు మినహాయింపు ఇచ్చారు. గతేడాది ఆగస్టు నుంచి తొలి విడత ట్రూ అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు. 2014 నుంచి వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు ట్రూ అప్ చార్జీల పేరుతో వసూలు చేస్తున్నారు. కర్నూలు సర్కిల్‌లోని విద్యుత్ వినియోగదారుల నుంచి 38 నెలల పాటు వసూలు చేస్తున్నారు. గతంలో వినియోగించుకున్న ప్రతి యూనిట్‌కూ 23 పైసలు లెక్క కట్టి బిల్లులో వేస్తున్నారు. ఇలా నాలుగు త్రైమాసికాల్లో నెలవారీగా వసూలు చేసేందుకు రంగం చేశారు. ప్రస్తుతం వస్తున్న బిల్లులో ఇప్పటికే వసూలు చేస్తున్న ట్రూఅప్ ఛార్జీలకు రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను చేర్చి వసూలు చేశారు. దీంతో సామాన్యులకు ఈ నెల విద్యుత్ బిల్లులపై తీవ్ర భారం పడింది. గతంలో నెలకు రూ.150 నుంచి రూ.300 వచ్చే వారికి రూ.250 నుంచి రూ.600 వరకు విద్యుత్ బిల్లులు వచ్చాయి. రూ.400 నుంచి రూ.600 వచ్చే వారికి రూ.600 నుంచి రూ.800, రూ.600 నుంచి రూ.800 బిల్లు వచ్చే వారికి రూ.850 నుంచి రూ.1100 వరకూ ఈ నెల విద్యుత్ బిల్లులు వచ్చాయి.



అదనపు చార్జీలు వసూలిలా..

2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగా నికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూని ట్‌కు 19 పైసలు చొప్పున, 2023 ఏప్రిల్‌లో వినియోగించుకు న్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) కింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది.

ఓర్వకల్లులో ప్రబలిన డయేరియా

- ఒకరు మృతి -40 మందికి అస్వస్థత
- అందరికీ మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల కేంద్రంలో నీరు కలుషితమై డయేరియా ప్రబలి 40 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరు మృతి చెందారు. మిగతా వారు ఓర్వకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి అతిసార ప్రబలి వాంతులు విరోజనాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కార్పెంటర్ అబ్దుల్లా (65) తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన పరిస్థితి విషమించి గురువారం చనిపోయారు. వైద్యులు అప్రమత్తయయ్యారు. తాగునీరు కలుషితం కావడం , మంచినీళ్ల ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, కొన్నిచోట్ల పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండటం వంటి కారణాల వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. డాక్టర్ మంజుల మాట్లాడుతూ అందరికీ సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తున్నామని, రక్త పరీక్షలు కూడా చేస్తున్నామని, వారికి మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు.

బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి: సిపిఎం

ఓర్వకల్లు ఆస్పత్రిలో వాంతులు విరోచనాలతో చేరిన బాధితులను సిపిఎం మండల కార్యదర్శి బి నాగన్న, నాయకులు వి.సుధాకర్, హమాలి యూనియన్ నాయకులు ఎల్లరాజు, చెన్నకేశవులు పరామర్శించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. బి.నాగన్న, వి.సుధాకర్ మాట్లాడుతూ అస్వస్థతకు గురై చనిపోయిన అబ్దుల్లా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. చికిత్స పొందుతున్న ప్రజలకు చిన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న బాధితులను టిడిపి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

ఓర్వకల్లును సందర్శించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు : ఓర్వకల్లును ఆర్‌డిఓ ఎంపిడిఓ, జడ్పిటిసి సభ్యులు, ఎంపిపి, సర్పంచి గ్రామాన్ని సందర్శించి ఆసత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రదేశాలతో అధికారులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశాలతో ప్రజాప్రతినిధులు వైసిపి నాయకులు వైద్యాధికారులు, సందర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి నీటి నమూనాలు సేకరించాలన్నారు.

ఓర్వకల్లును సందర్శిస్తున్న అధికారులు

గెస్ట్ ఫ్యాకల్టీని యథావిధిగా కొనసాగించాలి

- డిఇఒ కార్యాలయం ముట్టడించిన పార్ట్‌టైం ఉద్యోగులు - కెజిబివి కౌన్సెలింగ్ అడ్డగింత
- సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు - సమగ్ర శిక్ష అభియాన్ ఎపిసికి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కెజిబివిలో పనిచేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులుకు పరిగణలకు తీసుకోకుండా పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ పార్ట్ టైం ఉద్యోగులు డిఇఒ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. ఈ ఆందోళనకు మద్దతు తెలిపిన సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హుస్సేన్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అమర్ ఉన్నారు. ఈ సందర్భంగా కొంతసేపు పోలీసులకు పార్ట్‌టైం ఉద్యోగులకు వాగ్వాదం చోటుచేసుకుంది. దాదాపు మూడు గంటలకు పైగా సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు పోస్టుల కౌన్సిలింగ్ జరగకుండా నిలిపివేయడంతో పోలీసులు పార్ట్ టైం ఉద్యోగులను అక్కడి నుండి నిలువరించే ప్రయత్నం చేశారు. పోలీసులు జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకొనివెళ్లారు. వెంటనే ఈ ఆందోళన శిబిరానికి సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె వేణుగోపాల్ వచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్ ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్ ఎపిసికి సమస్యలను విన్నవించారు. యథావిధిగా వీరిని కొనసాగించి కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని యుటిఎఫ్ నేతలుకోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎపిసి జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు వారి సమస్యను తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మద్దతు తెలిపిన ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ. పార్ట్ టైం ఉద్యోగులకు గ్యారెంటీ ఉద్యోగ భద్రత ఉండదని అభద్రతా భావనతో ఉన్నారన్నారు. వారి డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యోగులందరూ ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. తక్షణమే పార్ట్ టైం ఉద్యోగులకు, గెస్ట్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించిన నాయకులు

సోదరభావంతో జీవిద్దాం...

- ఎస్పీ కృష్ణకాంత్
- ఆదోనిలో పీస్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

లౌకిక భారతదేశంలో కులమతాలకు అతీతంగా సోదరభావంతో కలిసి మెలిసి పండగలను, ఉత్సవాలను నిర్వహించుకుని మతసామరస్యాన్ని కాపాడదామని ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కోరారు. ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో పట్టణ పీస్ కమిటీ సమావేశం జరిగింది. అంతకుముందు వన్ టౌన్, టూ టౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అక్కడి నుంచి జామియా మసీదు, మహాయోగి లక్ష్మమ్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీస్ కమిటీని ఉద్దేశించి వారు మాట్లాడారు. ఆదోనిలో మంచి అభివృద్ధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు, ఎడ్యుకేషన్ పరంగా మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉందని చెప్పారు. చిన్న, చిన్న సమస్యలను పెద్దవిగా చేసి ఘర్షణలకు తావివరాదన్నారు. ఏదైనా మతపరమైన సమస్యలు ఏర్పడినప్పుడు రెవెన్యూ, పోలీసు అధికారులతో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకుని సోదరభావంతో కలిసిమెలిసి జీవించినప్పుడే మరింత అభివృద్ధికి బాటలు వేసిన వారవుతారని హితవు పలికారు. ఈ నెల 29న జరిగే బక్రీద్ పండగ సందర్భంగా ఎలాంటి వైషమ్యాలకు తావివ్వరాదని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ మాట్లాడారు. వ్యక్తిగత విభేదాలు ఏర్పడి కొందరి సమస్యను పెద్దదిగా చేసి 2011లో మత ఘర్షణలు జరిగేలా వ్యవహరించారని, అలాంటి వాటిని ఎవరూ ప్రోత్సహించరాదని కోరారు. బక్రీద్ సందర్భంగా కుర్బానీ నిర్వహించే స్థలంలో ఎలాంటి పారిశుధ్య సమస్యా తలెత్తకుండా సక్రమంగా శానిటేషన్ నిర్వహించాలని ముక్తర్ అహ్మద్ కోరారు. ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉంటామని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, సిఐలు శ్రీనివాస్ నాయక్, విక్రమ్ సింహ, నిరంజన్ రెడ్డి, నరసింహరాజు, ఎస్ఐలు చంద్ర, రమేష్, పీస్ కమిటీ సభ్యులు దేవిశెట్టి ప్రకాష్, కునిగిరి నీలకంఠ, దేవరాజ్, దిలీప్, మార్కెట్ యార్డు ఛైర్మన్ మజర్ అహ్మద్ అప్సర్ బాష, కాజీ అల్తాఫ్ హుస్సేన్, కాజీ హుస్సేన్, జుబేరా అహ్మద్, జమీల్ షఫీ, ఫయాజ్ కౌన్సిలర్ బాలాజీ ఉన్నారు. జామీయా మసీదు ట్రస్ట్ సభ్యులు మసీదు నిర్మించిన వారి వివరాలను, మసీదు చరిత్రను ఎస్పీకి వివరించారు. అనంతరం ఖతీబ్ జునైద్ హష్మీ వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద మసీదు ట్రస్టీ ఛైర్మన్ సౌదీ రావూఫ్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ సభ్యులు, పెద్దలు ఎస్పీని, సబ్ కలెక్టర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. మసీదు ట్రస్ట్ షావలీ, మౌజన్ సాబ్, సిఐలు పులి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మిగనూరు డీఎస్పీ బి.సీతారామయ్య అధ్యక్షతన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఏ చిన్న సమస్య తలెత్తినా ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తహశీల్దార్ రామాంజనేయులు, కమిషనర్ గంగిరెడ్డి, సిఐలు మధుసూదన్ రావు, మోహన్ రెడ్డి, మత పెద్దలు అల్ఫ్రెడ్ రాజు, విజిఎ.దయాసాగర్, మధుబాబు, సునీల్ కుమార్, ఖాసీం బేగ్, అతావుల్లా, షకీల్, మౌలానా వాహిద్, రసూల్, నరసింహులు, గిరిబాబు, రామకృష్ణ, కౌన్సిలర్ నగేశప్ప, శివ, పట్టణ ఎస్ఐ మస్తాన్ వలీ, పోలీసు సిబ్బంది సుభాన్, లక్ష్మన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణ కాంత్

మేనిపెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిజి.భరత్

నగరం అంతా సమస్యలే : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలో ఏ వీధికి వెళ్లినా సమస్యలే దర్శనమిస్తున్నాయని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి. భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 5వ వార్డు పరిధిలోని చిత్తారి వీధిలో గురువారం ఆయన వార్డు పర్యటన చేపట్టి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు అందించి టిడిపి మొదటి విడత మేనిఫెస్టోను వివరించారు. వార్డు పర్యటనకు వచ్చిన టీజీ భరత్‌కు ప్రజలు సమస్యలు చెప్పారు. డ్రైనేజీలు క్లీన్ చేయడం లేదని, అర్హత ఉన్నప్పటికీ పింఛన్ అందడం లేదని మొరపెట్టుకున్నారు. టిజి.భరత్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం వస్తే ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు.చంద్రబాబు విజనరీ లీడర్ అని ఆయన వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్నూలు అభివృద్ధి కోసం తనకు ఓటు వేయాలని భరత్ అభ్యర్థించారు. టిజివి సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య పరీక్షల కరపత్రాలను కూడా అందించారు. రూ.3 వేల విలువ చేసే వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అందరూ వైద్య పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని కోరారు. ఏవీధికి వెళ్ళినా సమస్యలు దర్శనమిస్తున్నాయని, తనకు ఓటు వేస్తే సమస్యలు లేని కర్నూలుగా చేస్తానని చెప్పారు. టిడిపి నేతలు నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాముడు

పథకాల అమలలో గృహ సారధులు కీలకం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గృహ సారధులు శ్రద్ద చూపాలని ఎంపిడిఒ రాముడు పేర్కొన్నారు. గురువారం కొత్తకోట సచివాలయంలో సమీక్షించి మాట్లాడారు. అర్హులైన వారందరికీ సక్రమంగా, సకాలంలో ప్రభుత్వ పథకాలు అందాలని, అందులోనే గృహ సారధులు శ్రద్ద చూపి తెలియని కుటుంబాలపై దృష్టి సారించి అందేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంతులీనిన క్రీడా జ్యోతులు

ఘనంగా ఒలింపిక్ డే రన్
క్రీడా స్ఫూర్తితో ఒలింపిక్ దినోత్సవ వేడుకాలు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్ : క్రీడా కాంతులతో గురువారం కర్నూలు నగర కూడళ్లలో క్రీడా జ్యోతుల దేదీప్యమానంగా వెలిగాయి. కర్నూలులో ఒలింపిక్ దినోత్సవాని క్రీడాలోకం ఘనంగా నిర్వహించింది. జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఒలింపిక్ దినోత్సావం నిర్వహించారు. కర్నూలులో లోని ఐదు కూడళ్లలో, స్టేడియం, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ , చెన్నమ్మ సర్కిల్లో , బిటి కాలేజీ, బీ కాంప్ నుండి క్రీడా జ్యోతులను చేతపట్టుకుని నగర వీధుల గుండా పరుగు తీశారు. ఒలింపిక్ చైర్మన్ కెయి ప్రభాకర్ , టిజి భారత్ , స్టేడి యంలో ప్రారంభించగా , నగర మేయర్ బివై రామయ్య , ఎస్‌వి. మోహన్ రెడ్డి బిటి కాలేజి దగ్గర ప్రారంభించారు. చెన్నమ్మ సర్కిల్ లో యోగ సంఘం రాష్ట్ర చైర్మన్ జిల్లా ప్రైవేట్ విద్య సంస్థల అధ్యక్షుడు బి.వాసుదేవయ్య , ఎంఇఒ శ్రీనివాసులు , వన్ టౌన్‌లో సిఐ నాగ శేఖర్ ప్రారంబించారు. ఎపిఎస్‌పి రెండోవ పటాలం డిఎస్‌పి మహబూబ్ బాషా , ఆర్ఐ కృష్ణ మూర్తి, ఆర్ఎస్ఐ రామాంజనేయులు ప్రారంభించారు. ఐదు కూడళ్లలో నుండి రాజవిహార్ చేరుకున్నారు. అనంతరం ఐదు జ్యోతులతో మౌర్యా ఇన్ మీదుగా స్టేడియం చేరుకున్నారు. ఎంపి.సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుండే క్రీడలను సాధన చేయాలన్నారు. క్రీడలకు ప్రభుత్వంపెద్ద పీట వేసిందన్నారు. చిన్నారులకు 'ఆటలు ముద్దు సెల్ఫోన్ వొద్దు' అనే నినాదం మేయర్ బివై.రామయ్య ఉద్బోధించారు. ఎస్‌వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో క్రీడాకారులకు , సైంటిస్టులకు ఉన్న గుర్తింపు ఎవరకీ ఉండదని అన్నారు. క్రీడాశాఖ సిఇఒ రమణ మాట్లాడారు. ఒలింపిక్ సిఇఒ పి.విజయకుమార్ , అధ్యక్షుడు జగదీశ్ కుమార్ , కార్యదర్శి శ్రీనివాసులు , కార్యనిర్వకాహా కార్యదర్శి పి.సునీల్ కుమార్ , ఒలింపిక్ ఉపాధ్యాక్షులు గంగాధర్ గౌడ్ , కబడ్డి రాజశేఖర్, శుభకర్ , డాక్టర్ శంకర్ శర్మ , శమంతక మణి పాల్గొన్నారు , మోంటెస్సోరి స్కూల్ , స్కేటింగ్ ,పలువురు విద్యార్థులు, శిల్పా చేసిన నృత్య ప్రదర్శన లు చూపరులకు కనువిందు చేసాయి. వారం రోజుల పాటు నిర్వహించిన క్రీడల పోటీల బహుమతులను విద్యార్థులకు అతిథులు అందజెశారు.

క్రీడా జ్యోతులను స్వీకరిస్తున్న అతిథులు

నిధులున్నా ఎందుకు ఖర్చు చేయరు : కలెక్టర్

నాడు నేడు పనులపై జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నాడు నేడు కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు నిధులు ఉన్నప్పటికీ ఎందుకు ఖర్చు చేయడం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో నాడు నేడు పనులపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మన బడి నాడు-నేడు పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ అందులో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రణాళిక వేసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పూర్తి అయిన పనులను ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ,మండల స్థాయి అధికారులను ఆదేశించారు. తరగతి గదుల మరమ్మతులు 651 పాఠశాలకు మంజూరు కాగా, 624 వాటిని భౌతికంగా పూర్తి చేశామన్నారు. వాటిలో 503 మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేశారని అన్నారు. విద్యుదీకరణ పనులకు సంబంధించి 676 పాఠశాలకు మంజూరు కాగా 627 వాటిని భౌతికంగా పూర్తి చేశామన్నారు. భౌతికంగా పూర్తి అయిన ప్రతి ఒక్కటి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి ఎక్కువ శాతం పనుల పెండింగ్‌లో అస్పరి, ఓర్వకల్లు, హాలహర్వి, గోనేగండ్ల మండలాలు ఉన్నాయన్నారు. సదరు ఎఇలు రేపు సాయంత్రం నాటికి పెండింగ్ ఉన్న అన్ని పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో పనులు నిర్వహిస్తూ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలలో ఎక్కువ శాతం ఆర్‌డబ్ల్యూఎస్ వారి దగ్గరే పెండింగ్ ఉన్నాయన్నారు. ఎపిఇడబ్ల్యుఐటిడిసికి సంబంధించి కోడుమూరులో పెండింగులో ఉన్న తరగతి మరమ్మతులు, విద్యుదీకరణ తదితర పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, సర్వశిక్షా అభియాన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జూన్ 30 నాటికి పాఠశాలలో తాగు నీరు, టాయ్‌లెట్ విత్ రన్నింగ్ వాటర్, కిచెన్‌షెడ్స్ పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో ఎస్ఎస్ఎ పిఒ వేణుగోపాల్, డిఇఒ రంగారెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఎపిఇడబ్ల్యుఐడిసి ఇఇ ఎం.లక్ష్మీనారాయణ, ఎడి సామ్యూల్ పాల్, ఇఇలు, డిఇలు, ఎఇలు ఎంఇఒలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

మోటార్ల దొంగలతో సిఐ ఈశ్వరయ్య ,ఇతర సిబ్బంది

మోటార్ల దొంగలు అరెస్టు

నలుగురు సహా మైనర్ బాలుడు అరెస్టు
12 మోటర్లు, రెండు ఆటోలు రూ.65000 నగదు స్వాధీనం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

యజమానుల కళ్ళు గప్పి మోటార్లను దొంగతనం చేసే నలుగురు వ్యక్తులు సహా ఒక మైనర్ బాలుడిని అరెస్టు చేశామని నాలుగో పట్టణం పోలీస్ సిఐ శంకరయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన స్టేషన్లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాటల్లో.... కర్నూలు నగరం ముజఫర్ నగర్ కు చెందిన సురేష్ గోపాల్, నన్నూరు కు చెందిన ఎరుకలి బాలనాగన్న, శ్రీనివాస్ నగర్ కు చెందిన గానుగ రామప్ప వికర్షణ కాలనీకి చెందిన పరశురాం శివప్ప నగర్ కు చెందిన ఓ మైనర్ బాలుడు ముఠాగా ఏర్పడి తరచుగా ఎలక్ట్రికల్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. బుధవారం సాయంత్రం సంతోష్ నగర్ లోని సుంకులమ్మ దేవాలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అరెస్టు చేసి విచారించగా వారి నుంచి రెండు ఆటోలు, 12 ఎలక్ట్రికల్ వాటర్ మోటార్లు, రూ.65000 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మొదటి నలుగురు నిందితులను రిమాండుకు పంపారు. మైనర్ బాలుడిని జువనల్ హోమ్‌కు తరలించామని పేర్కొన్నారు. కేసులో ప్రత్యేక ప్రతిభను చూపించిన పోలీసులను సిఐ అభినందించారు

మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తుగ్గలి

ప్రస్తుతం వస్తున్న మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తుగ్గలిలో మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌సి కాలనీలో పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న ఆంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా దోమల కాటు నుండి తప్పించుకోవాలన్నారు. పరిశరాలు పరిశుభ్రంగా ఉంటే అంటు వ్యాధులు దగ్గరకు రావన్నారు. అందుకు గ్రామ పంచాయితీ కాలులలో ఉన్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సూపర్వైజర్ నాగమ్మ, సచివాలయం ఆరోగ్య కార్యదర్శి మహాలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మలేరియా అధికారి

మున్సిపల్ హైస్కూల్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి - ఆదోని

స్కూల్ భవనం

పట్టణంలోని పురాతనమైన పాఠశాలల్లో మున్సిపల్ హైస్కూల్ ముందు వరుసలో ఉంది. నాడు-నేడు నిధులతో మున్సిపల్ హైస్కూల్ భవన సముదాయానికి పూర్వ వైభవం వచ్చింది. గతంలో వర్షం వస్తే లీకేజీ ఏర్పడి గదులు తడిసిపోయేయి. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా గదుల్లేక ఇబ్బందులు ఉండేవి. నాడు-నేడు నిధులతో గదులకు మరమ్మతులు, రంగులు వేయడంతో మున్సిపల్ హైస్కూల్ రూపురేఖలే మారాయి. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్‌లో నాడు-నేడు నిధులు రూ.66 లక్షలతో 15 గదుల నిర్మాణం జరుగుతోంది. నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు గదుల కొరత సమస్య తీరుతుంది. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయం ఉండడంతో ఇక్కడ చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 1,703 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో 1,093 మంది బాలురు, 605 మంది బాలికలు ఉన్నారు. గదుల నిర్మాణం పూర్తయితే సమస్య తీరుతుందని విద్యార్థులు చెబుతున్నారు.

చేరే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది : మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు

హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు ఉండడం వల్ల చేరేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. వారికి మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్న విషయాన్ని అధికారులకు విన్నవిచ్చాం. నాణ్యమైన భోజనం సకాలంలో వడ్డించేందుకు ఏర్పాట్లు చేశాం. అప్పటితో పోల్చుకుంటే హైస్కూల్‌లో సమస్యలు తీరాయి.

యుటిఎఫ్ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న నాగమణి

25న ఫ్యాప్టో జిల్లా సదస్సు : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 25న ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప కోరారు. గురువారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో పి.గురుస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏ కాంట్రిబ్యూషన్ లేని పింఛను విధానం కోసం పోరాటాలు నిర్వహిస్తుంటే జిపిఎస్ అనే కొత్త పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. పాత పింఛను విధానాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 25న కర్నూలు జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరిగే సదస్సులో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దావీదు, దేవపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.నాగరాజు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, రాఘవేంద్ర, జ్ఞాన ప్రకాష్, ఎం.రాజు, లక్ష్మన్న, ప్రసాద్, శివకుమార్, చంద్రపాల్, పెద్దారెడ్డి, భాగ్యరాజు, వై.రామాంజనేయులు, రవికుమార్, తాతయ్య, నాగజ్యోతి, సుధాకర్, నీలి నాగరాజు, రాజశేఖర్ రెడ్డి, రాజేశ్వర గౌడ్, బి.రామాంజనేయులు, నాగేశ్వరరావు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన వైసిపి'

ప్రజాశక్తి - మంత్రాలయం

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైసిపి పాలనలో విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. గురువారం ఎమ్మిగనూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో 'ఫీజు ఎక్కడ కంస మామా' గోడపత్రికను టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, రాష్ట్ర కార్యదర్శి చూడి శివమూర్తి, నియోజకవర్గ అధ్యక్షులు శంకర్ నాయక్, ఉపాధ్యక్షులు బిటి.రామ చంద్ర నాయుడు, కార్య నిర్వాహక కార్యదర్శి దినకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన విద్యా వ్యవస్థ వైసిపి పాలనలో నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని తెలిపారు. విద్యా వ్యవస్థను నాశనం చేసే వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు.

అడుగంటిన 'చింతకుంట'

- జలాశయంలో నీరు లేక వెలవెల - తాగునీరు దొరకక గ్రామాల్లో విలవిల
- ముందు చూపు లేకనే పాలకులు, అధికారుల తప్పిదాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

నీరు అడుగంటడంతో చింతకుంట జలాశయం వెలవెలబోతోంది. గ్రామాల్లో తాగునీరు దొరకక ప్రజలు విలవిల్లాడుతున్నారు. అధికారులు, పాలకులకు ముందు లేకపోవడంతోనే ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు విమర్శిస్తున్నారు. 50 ఏళ్ల నిర్మించిన జలాశయం కావడంతో ఇప్పడున్న జనాభాకు అనుగుణంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జలాశయంలో అడుగంటిన నీరు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కార కోసం రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి రిజర్వాయర్లు, చెరువులు, ఫిల్టర్ బెడ్లు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఎన్ని రూ.కోట్లు ఖర్చు పెడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. హాలహర్వి మండలం చింతకుంట గ్రామ సమీపంలో నిర్మించిన రిజర్వాయర్‌లో నీరు పూర్తిగా ఇంకిపోయింది. హాలహర్వి, చిప్పగిరి మండలాల్లోని 22 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. చిప్పగిరి మండలంలో డేగలహాల్, నేమకల్లు, నగరడోనా, రామదుర్గం, సంగాల తదితర గ్రామాల్లో దాదాపు నెల దాటినా చింతకుంట జలాశయం నుంచి పంపింగ్ లేక తాగునీటికి వెంపర్లాడే పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో వాడుకోవడానికి ఉన్న బోర్లు చెడిపోవడంతో తాగడానికి, వాడుకోవడానికి కూడా ఫిల్టర్ నీరే కొంటున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం 1973లో అంటే 50 ఏళ్ల క్రితం చింతకుంట జలాశయం నిర్మించారు. ఈ రిజర్వాయర్ నుంచి దాదాపు 22 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 6 అడుగులుగా ఉంది. రిజర్వాయర్‌లో ఏళ్ల తరబడి పూడిక పేరుకుపోవడంతో నీరు నిల్వ ఉండడం లేదు. ఎల్ఎల్‌సి కాలువలో నీరు పోతున్నప్పుడు రిజర్వాయర్‌లో నీరు నిల్వ చేసుకోవాలి. రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోవడంతో కేవలం 4 అడుగులు మాత్రమే నీరు ఉంటున్నాయి. ప్రస్తుతం ఎల్ఎల్‌సి కాల్వకు నీరు నిలిచిపోయింది. చింతకుంట రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు ఇంకిపోవడంతో నెల రోజుల నుంచి 22 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయినట్లు గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు ఇంకిపోవడం వల్ల జలాశయమంతా ఎండిపోయి నెరలు పొరలుగా మారింది. అధికారులకు, పాలకులకు ముందు చూపు లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు జలాశయం పరిస్థితిని ఎప్పటికప్పుడు చూసుకుంటున్నా ఏ లోటుపాట్లు ఉన్నాయో చూసుకోవడం లేదని, సమస్యలుంటే పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ప్రజలు కోరుతున్నారు.

చింతకుంట జలాశయం సామర్థ్యం పెంచాలి

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్ లీలా, చిప్పగిరి మండలం

ఇప్పటి జనాభాకనుగుణంగా చింతకుంట జలాశయం సామర్థ్యం పెంచితే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదు. ప్రతేడాది ఎనర్జిస్ నిధులతో పూడికతీత పనులు చేస్తున్నా తాగునీటి సమస్య ఏర్పడుతోంది. సామర్థ్యం పెంచేలా ప్రజాప్రతినిధులకు తెలియజేస్తాం.

తాగునీటి సమస్యను కూడా పరిష్కరించలేకపోతే ఎలా

- మాబు హుస్సేని, నేమకల్లు గ్రామం

గ్రామాల్లో కనీసం తాగునీటి సమస్యను కూడా పరిష్కరించలేకపోతే ఎలా. నేమకల్లు గ్రామంలో దాదాపు నెల దాటినా తాగునీరు వదల్లేదు. రోజూ ఫిల్టర్ నీరు కొనే పరిస్థితి ఉంది. గ్రామంలో ఉన్న బోర్లు చెడిపోతే వాడుకోవడానికి, తాగడానికి ఫిల్టర్ నీరే కొంటున్నాం.

బాలిక తల్లిదండ్రుల ఆత్మహత్యాయత్నం

- కలెక్టర్‌ను కలిసేందుకు కర్నూలుకు బయల్దేరిన బాలిక కుటుంబం - అడ్డుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

పోలీసులతో వాదిస్తున్న కుటుంబ సభ్యులు

అత్యాచారయత్నానికి గురైన బాలిక తల్లిదండ్రులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబం కలెక్టర్‌ను కలిసేందుకు కర్నూలుకు బయల్దేరగా ఎస్ఐ వారిని అడ్డుకున్నారు. మండలంలోని గంజిహళ్లి గ్రామంలో మూడురోజుల క్రితం బాలిక అత్యాచారయత్నానికి గురైంది. గురువారం బాలిక కుటుంబ సభ్యులు గంజిహళ్లి గ్రామంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. సంఘటన జరిగి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ, ఘటనతో సంబంధం ఉన్న మరో ముగ్గురిని అరెస్టు చేయాలని కోరినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, అలాగే తమది నిరుపేద కుటుంబమని, తమ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు, ప్రభుత్వం, అధికారులు తమను ఆదుకోవాలని కోరేందుకు బాలిక తల్లిదండ్రులు, కొంతమంది గ్రామస్తులతో కలిసి లారీలో కర్నూలుకు బయల్దేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మారెడ్డి గంజిహళ్లి గ్రామానికి చేరుకున్నారు. 'కర్నూలుకు ఎందుకు వెళ్తున్నారు. ఇక్కడికే ఉన్నతాధికారులు వస్తారు. మీకు న్యాయం చేస్తామ'ని వారు ఏర్పాటు చేసుకున్న వాహనాన్ని అక్కడి నుంచి పంపించి వారిని కర్నూలుకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారని బాలిక కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. సుమారు రెండు గంటలపాటు వాగ్వాదం జరిగింది. ఉన్నతాధికారులను కలిసేందుకు కర్నూలుకు వెళ్లనీయకపోవడంతో ఆవేదన చెందిన బాలిక కుటుంబం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన గ్రామస్తులు వారిపై నీటిని చల్లి ప్రమాదం నుంచి తప్పించారు. బాలిక తల్లి పెట్రోల్ తాగి అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం ఆమెను గోనెగండ్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

మా కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోండి

తన కూతురికి జరిగిన ఘటన మరెవ్వరికీ జరగరాదని, నిందితులను కఠినంగా శిక్షించి ఘటనతో సంబంధం ఉన్న మరో ముగ్గురిని అరెస్టు చేసి న్యాయం చేయాలని బాలిక తండ్రి అర్జున్ కోరారు. అలాగే తమది నిరుపేద కుటుంబమని, తన కూతురు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకొని సహాయం చేయాలని ఆయన వేడుకున్నారు. కలెక్టర్‌ను కలవకుండా తమను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు.

ఎస్ఐ తిమ్మారెడ్డి వివరణ : తమ ఉన్నతాధికారుల సూచనల మేరకే గంజిహళ్లి గ్రామానికి వెళ్లి కర్నూలుకు ఎంతమంది వెళ్తున్నారు, ఎందుకు వెళ్తున్నారనే వివరాలను సేకరించేందుకే వెళ్లాం. బాలిక కుటుంబానికి చట్టపరంగా న్యాయం చేస్తాం. వారెలాంటి అపోహలకు గురికారాదు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసిపి ప్రభుత్వంతో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి చేకూరిందని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 24వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వార్డు పరిధిలోని కొన్ని వీధుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, సిసి రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయాలని ఒక ప్రణాళిక ప్రకారం సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు.

25న సదస్సును జయప్రదం చేయండి : ఫ్యాప్టో

ఎమ్మిగనూరు : ఈనెల 25న కర్నూలు జడ్‌పి మీటింగ్ హాలులో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తాలూకా కన్వీనర్ కరె కృష్ణ, కోకన్వీనర్స్ బసవరాజు, దావీదు, ఖాసీం కోరారు. గురువారం వీవర్స్ కాలనీలో ఫ్యాప్టో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఫ్యాప్టో తాలూకా బాధ్యులు గోట్ల చంద్ర శేఖర్, నీలకంఠ, అడివన్న, నరసింహులు, బాబయ్య, పాపన్న, వెంకటరాముడు, దేవపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం 'జగనన్న ఆణిముత్యాలు' : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - నందవరం

'జగనన్న ఆణిముత్యాలు' విద్యార్థుల ప్రతిభ ప్రోత్సాహమని కెజిబివి ప్రిన్సిపల్ ఆర్.శైలజ తెలిపారు. గురువారం నందవరంలోని కెజిబివి పాఠశాలలో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' ద్వారా పాఠశాల స్థాయిలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో పదో తరగతి ఉత్తమ ప్రతిభ కనబరిచిన బోయ వాణికి రూ.3 వేలు, దివ్యభారతికి రూ.2 వేలు, దస్తగిరమ్మకు రూ.వెయ్యి నగదు, ప్రశంసాపత్రం, మెడల్స్‌ను ప్రిన్సిపల్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ మాబుబీ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు రంగమ్మ, దివ్యభారతి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఉరుకుంద, వృత్తి విద్యా ఉపాధ్యాయులు రమాదేవి, పాఠశాల సిబ్బంది మౌనిక, నేలవేణి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూలుస్తాం

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని : పట్టణంలో అధికారుల అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని దండుగేరి ప్రాంతంలో మురుగుకాలువలపై నిర్మించిన కట్టడాలను తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను గుర్తించి సంబంధిత వ్యక్తులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. క్రమబద్ధీకరణ చేయించుకోకపోతే వాటిని కూడా తొలగిస్తామన్నారు.

నూతన ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

హాలహర్వి : హాలహర్వి నూతన ఎస్ఐగా నాగేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న ఎస్ఐ జలదుర్గంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరిస్తే అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని ముచ్చిగిరి ఎంపియుపి పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్ ఈరన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలోని దాదాపు 150 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. సర్పంచి హనుమంతు, ఉప సర్పంచి ఎల్లప్ప, సచివాలయ కన్వీనర్ సురేష్ గౌడ్, డీలర్ నాగప్ప, నట్టేకల్ నరసప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలి : ఎస్ఎఫ్ఐ

హొళగుంద : ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు గురుప్రసాద్ మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు అందించకపోతే ఇంటర్ విద్యార్థులు ఏ రకంగా చదువుకోవాలని ప్రశ్నించారు.

నకిలీలు విక్రయించొద్దు : ఎఒ

పెద్దకడబూరు : మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీలను విక్రయించొద్దని ఎఒ వరప్రసాద్ ఆదేశించారు. గురువారం పెద్దకడబూరులోని సొసైటీ, ఇతర ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతినెలా స్టాక్ రికార్డులను వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దుకాణాల్లో నకిలీ మందులను, విత్తనాలను విక్రయించొద్దని తెలిపారు.

Order 21 Rule 34 CPC NOTICE
మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.34/2020
ఇన్
ఓ.ఎస్.54/2009
పాలకొలను బ్రహ్మారెడ్డి ......డిహెచ్‌ఆర్
వర్సెస్
గడ్డం అంకిరెడ్డి(చనిపోతే) వారసులు
శ్రీమతి గడ్డం తులశమ్మ వగైరాలు ... జెడిఆర్‌ఎస్‌టు,
R3 : శ్రీమతి వి.అనిత భర్త: వి.ఈ.నరసింహారెడ్డి, హిందూ, వయస్సు 33సం.లు, గృహిణి, డోర్.నెం.87-1378, శేషాద్రినగర్, నందికోట్కూర్ రోడ్డు, కర్నూలు టౌన్ & జిల్లా.
R4 : శ్రీమతి అట్లా సుజాత అలియాస్ సుజిత భర్త శ్రీనివాసరెడ్డి,హిందూ, వయస్సు 31సం.లు, గృహిణి, ఆంధ్రా బ్యాంకు దగ్గర, డోన్ టౌన్ & మండలం, కర్నూల్ జిల్లా.
పై నెంబరు అమలు అర్జీలో శ్రీ కోర్టు వారు ది : 26-06-2019వ తేదిన పాలించిన డిక్రీ షరతుల మేరకు ఈ.పి షెడ్యూల్ ఆస్తికి మీ నుండి రిజిష్టరు విక్రయ దస్తావేజు పొందు నిమిత్తం డిహెచ్‌ఆర్ అమలు అర్జీని దాఖలు చేసుకొని యున్నాడు. సదరు అమలు అర్జీలో మీకేమైన ఆక్షేపణలున్న యెడల మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది : 04-07-2023 న ఉదయం 10:30 ని.లకు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
స్థలం : గిద్దలూరు
తేది: 22-06-2023 శ్రీ ఎస్.వి.నాగేంద్రబాబు
అడ్వకేటు, గిద్దలూరు.
సెల్ నెం.9866802375

CHANGE IN SURNAME
By this deed I, the undersigned PERUGU PUSHPAVATHAMMA (New Name) W/o Perugu Chandra Reddy previously called PERUGU PUSPAVATAMMA (Old Name) Resident of H.No. 1-2, Near Sivalayam, Dinnedevarapadu, Kurnool - 518002, Andhra Pradesh (address) solemnly declare:-

నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బనవాసిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ కె.చందిరన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. అభ్యర్థులు 3, 4వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు. 5వ తరగతి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాంతం వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు మే 1, 2012 నుంచి జూన్ 31, 2014 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 10 చివరి తేదీ అని చెప్పారు. జనవరి 20, 2024న ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ : https://cbseitms.rcil.gov.in/nvs ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విజయ్ సాయిని కలిసిన జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

అమరావతిలోని తాడేపల్లి కార్యాలయంలో గురువారం వైసిపి పార్లమెంట్ నాయకులు విజయ్ సాయి రెడ్డిని ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2024లో జరిగే ఎన్నికల్లో కలిసికట్టుగా వైసిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని, అందుకు ఇప్పటినుంచే కృషి చేయాలని విజయసాయిరెడ్డి కోరారని జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. అలాగే సోషల్ మీడియా ఇన్‌ఛార్జీ అర్జున్ రెడ్డి పార్టీ స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారన్నారు. వైసిపి మాజీ కన్వీనర్ ఓబులేసు, మాజీ కోకన్వీనర్, వాల్మీకి మండల అధ్యక్షులు లోకనాథ్ పాల్గొన్నారు.



విజయ్ సాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్‌పిటిసి

సాగు, తాగునీటి కోసం పాదయాత్రలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సాగు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి, వలసలు వంటి సమస్యలు పరిష్కరించాలని, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో జులైలో జరిగే పాదయాత్రలను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కోరారు. గురువారం మండలంలోని పాండవగల్లు గ్రామంలో ఉన్న పాతూరు ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఆదోని, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు మండలాల కార్యకర్తలకు రెండో రోజూ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా అత్యంత వెనుకబడి ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఇప్పటికీ 22 శాతం పేదరికం ఉందని అనేక నివేదికలు తెలియజేశాయని చెప్పారు. ఈ వెనుకబాటుతనానికి పాలక ప్రభుత్వాలే కారణమన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు లేక సాగునీరు లేక రైతులు కేవలం వర్షాలపై ఆధారపడి పంటలు పండించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పశ్చిమ ప్రాంతంలో ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. సిపిఎం నాయకులు కె.లింగన్న, ఈ.తిక్కన్న, కె.రాముడు, ఎం.ఈరన్న పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం

ఆస్పరి : దేశంలో బిజెపి మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.అంజిబాబు కోరారు. సబ్‌స్టేషన్ దగ్గర ఆస్పరి, దేవనకొండ మండలాల్లోని పార్టీ సభ్యుల క్లాసులు సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకే దేశం, ఒకే భాష పేరుతో దేశంలో బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ లౌకికవాదాన్ని నాశనం చేస్తోందని మండిపడ్డారు. సిపిఎం మండల నాయకులు బాలకృష్ణ రంగస్వామి, రామాంజినేయులు, మల్లేష్, మధు రెడ్డి, రవి, సీనియర్ నాయకులు రామాంజినేయులు, మాణిక్యప్ప, నరసిహులు, రంగప్ప, ఈరన్న, సూరి పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న రామాంజనేయులు

ఆస్పరిలో మాట్లాడుతున్న అంజిబాబు

గిరిజన గురుకులాలపై ఎందుకు వివక్ష : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గురుకుల పాఠశాలకు నిధులు కేటాయించడంతో వివక్షత చూపుతోందని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. గురువారం అంబేద్కర్ సర్కిల్‌లో డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ధనుంజయ్ మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నప్పటికీ ఆలూరులోని గిరిజన గురుకుల బాలికల, ఆశ్రమ బాలుర పాఠశాలలు మాత్రం ప్రారంభానికి నోచుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మారుమూల ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న గిరిజన పిల్లల సంక్షేమం కోసం, గిరిజన విద్యార్థులకు విద్యనందించి వారి అభివృద్ధికి దోహదపడుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలకు ప్రభుత్వం నిధులు కేటాయించడంలో వివక్ష చూపుతోందన్నారు. ఈ పాఠశాలలో చాలీచాలని వేతనాలతో వంట పని చేసే వర్కర్లకు 18 నెలలు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించలేకపోవడంతో విధులకు రావడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు భోజనం ఇబ్బందిగా మారిందని తెలిపారు. వెంటనే వంట చేసే వర్కర్లకు ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించి వారిని విధులకు హాజరయ్యేలా చూసి, గిరిజన పాఠశాలలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు చందు, రఘు, సూరి, మంజు, నరేష్, నరసింహా, శేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉల్లిరాజు, మల్లికార్జున, పరమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

త్రిపుర బాధితులకు విరాళాలు సేకరణ

ప్రజాశక్తి - ఆస్పరి

త్రిపుర రాష్ట్రంలో బిజెపి దాడుల్లో సర్వం కోల్పోయిన సిపిఎం కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం ఆస్పరిలో విరాళాలు సేకరించారు. ఈ సంద్భంగా సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, హనుమంతు మాట్లాడారు. బిజెపి అధికార దాహంతో సిపిఎం కార్యాలయాలు, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. త్రిపుర బాధితులకు అండగా ఉండాలని పేర్కొన్నారు. సిపిఎం నాయకులు రంగస్వామి, రామాంజినేయులు, బాలకృష్ణ, మధు రెడ్డి, ఈరన్న, తిప్పన్న, అశోక్ పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ఎర్ర తెగులుపై ఆందోళన చెందొద్దు

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ

ప్రజాశక్తి - దేవనకొండ

అధిక ఉష్ణోగ్రతలతో పత్తి పంటకు సోకిన ఎర్ర తెగులుపై రైతులు ఆందోళన చెందవద్దని, తొందరపడి పంటను తొలగించవద్దని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ తెలిపారు. గురువారం దేవనకొండ పరిసర ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. మేలో వేసిన పంటలు అధిక ఉష్ణోగ్రత వల్ల, భూమి నుంచి పైరుకు కావాల్సిన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం తీసుకోవడంలో ఆటంకం కలిగి ఆకులు ఎర్రగా మారుతున్నాయని తెలిపారు. ఎర్ర తెగులు నుంచి పంటను కాపాడుకోవడానికి 19-19-19 లేదా 14-0-35ని ఒక లీటరు నీటిలో 5 గ్రాములు కలుపుకొని మొక్కలు బాగా తడిసేటట్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. మళ్లీ 5 రోజుల తర్వాత ఫార్ములేషన్ 4 లేదా 6, 5 గ్రాములు 1 లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే బోర్లు, బావుల కింద సాగు చేసిన పత్తి పంటలో తెగులు ఆశించడం గమనించినట్లు తెలిపారు. నివారణకు కాపు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటి కలుపుకొని మొక్కల మొదల దగ్గర వేసుకోవాలన్నారు. డిఆర్‌సి ఎడిఎ వెంకటేశ్వర్లు, ఎఒలు మధుమతి, శశిధర్, ఎఒ సురేష్ బాబు, ఎఇఒలు యోగేంద్ర, రంగన్న, విఎఎలు మల్లికార్జున, రంగాచారి పాల్గొన్నారు. **గోనెగండ్ల**తో పాటు మండలంలోని గంజిహళ్లి గ్రామంలో ఎర్ర తెగులు ఆశించిన పత్తి పంటను కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త సుజాత బృందం పరిశీలించింది. డిఆర్‌సి ఎడిఎ వెంకటేశ్వర్లు డిఆర్‌సి ఎఒలు మధుమతి, శశిధర్, ఎమ్మిగనూరు ఎడిఎ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత, విఎఎలు షఫీ, మహేంద్ర, జావిద్ పాల్గొన్నారు.

దేవనకొండలో పత్తి పంటను పరిశీలిస్తున్న సుజాతమ్మ

విత్తన కొరత లేదు

- జిల్లాకు 8,172 క్వింటాళ్ల విత్తనాలు
- అవసరమైన రైతులు ఆర్‌బికెల్లో తీసుకోవచ్చు
- జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి జిల్లాలో ఎలాంటి విత్తన కొరత లేదని, జిల్లాకు 8,172 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని, అవసరమైన రైతులు ఆర్‌బికెలకు వెళ్లి తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి ఖరీఫ్-2023 సీజన్‌కు ప్రభుత్వం సబ్సిడీ కింద విత్తనాలను సరఫరా చేస్తుందన్నారు. కంది 500 క్వింటాళ్లు, మినుములు 85, పెసలు 18, కొర్రలు 16, వేరుశెనగ 3560, పచ్చి రొట్టే విత్తనాలు, జీలుగ 3993 క్వింటాలు జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు. ఇది పూర్తిస్థాయిలో డి క్రిష్ యాప్ ద్వారా ఆర్‌బికెలో రైతులకు అందజేస్తున్నారని తెలిపారు. విత్తనాల సంబంధించిన లేదా విత్తన వ్యాపార దుకాణాలకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా రైతులు తక్షణమే 331057582 నంబర్‌కు తెలపాలని సూచించారు. ఎరువులు జిల్లాలో సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. ఈ నెలలో జిల్లాకు 4300, యూరియా 3850 మెట్రిక్ టన్నులు, డిఎపి అవసరం కాగా ప్రస్తుతం యూరియా 15170, డిఏపి 14084, ఎన్‌పికె కాంప్లెక్స్ ఎరువులు 35065 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఆర్‌బికెల ద్వారా 88,400 వేల మెట్రిక్ టన్నులు రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు.

ట్రూ అప్ భారం రూ.163 కోట్లు

- సామాన్యులపై బాదుడు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం భారాన్ని మోపింది. గత 9 నెలలుగా ట్రూ అప్ (సర్దుబాటు) చార్జీలు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే.. దీనికి అదనంగా ఈ నెల నుంచి మరికొంత వసూలు చేస్తున్నారు. దీంతో ఈనెల నుంచి వచ్చిన విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి...

కేంద్ర ప్రభుత్వ సూచనలతో సామాన్యులపై ఇప్పటికే వివిధ రూపాల్లో భారాలు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరుతో ఈ నెల నుంచి మరింత భారాన్ని మోపింది. ఎపిఈఆర్‌సి నుంచి రెండో విడత సర్దుబాటు చార్జీలు వసూలు చేసేందుకు ఇప్పటికే అనుమతి వచ్చింది. దీంతో ఇప్పటికే వేస్తున్న విద్యుత్ భారానికి అదనంగా మరికొన్ని నెలల పాటు ట్రూఅప్ పేరుతో విద్యుత్ భారాన్ని మోపాయి. 2021-22 సంవత్సరానికి సంబంధించి డిస్కంకు వచ్చిన నష్టాలు పూడ్చుకునేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేశారు. 2021-22 ఏప్రిల్‌లో వాడిన యూనిట్లపై ట్రూ అప్ భారాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో కలిపారు. ఏ నెలకు సంబంధించిన బిల్లును ఆ నెల వసూలు చేయనున్నారు. అప్పట్లో అధికంగా విద్యుత్ వాడకం ఉంటే.. ప్రస్తుతం అందుకు సంబంధించిన భారం సామాన్యులపై పడింది.



ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 11 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ, వాణి, పారిశ్రామిక భారం వేశారు. నికరంగా 12.50 లక్షల మందిపై సుమారు రూ.163 కోట్ల మేర భారం పడింది. 2019 ఏప్రిల్ తర్వాత తీసుకున్న విద్యుత్ కనెక్షన్లకు మినహాయింపు ఇచ్చారు. గతేడాది ఆగస్టు నుంచి తొలి విడత ట్రూ అప్ చార్జీలు వసూలు చేస్తున్నారు. 2014 నుంచి వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు ట్రూ అప్ చార్జీల పేరుతో వసూలు చేస్తున్నారు. కర్నూలు సర్కిల్‌లోని విద్యుత్ వినియోగదారుల నుంచి 38 నెలల పాటు వసూలు చేస్తున్నారు. గతంలో వినియోగించుకున్న ప్రతి యూనిట్‌కూ 23 పైసలు లెక్క కట్టి బిల్లులో వేస్తున్నారు. ఇలా నాలుగు త్రైమాసికాల్లో నెలవారీగా వసూలు చేసేందుకు రంగం చేశారు. ప్రస్తుతం వస్తున్న బిల్లులో ఇప్పటికే వసూలు చేస్తున్న ట్రూఅప్ ఛార్జీలకు రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను చేర్చి వసూలు చేశారు. దీంతో సామాన్యులకు ఈ నెల విద్యుత్ బిల్లులపై తీవ్ర భారం పడింది. గతంలో నెలకు రూ.150 నుంచి రూ.300 వచ్చే వారికి రూ.250 నుంచి రూ.600 వరకు విద్యుత్ బిల్లులు వచ్చాయి. రూ.400 నుంచి రూ.600 వచ్చే వారికి రూ.600 నుంచి రూ.800, రూ.600 నుంచి రూ.800 బిల్లు వచ్చే వారికి రూ.850 నుంచి రూ.1100 వరకూ ఈ నెల విద్యుత్ బిల్లులు వచ్చాయి.

అదనపు చార్జీలు వసూలిలా..

2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగా నికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూని ట్‌కు 19 పైసలు చొప్పున, 2023 ఏప్రిల్‌లో వినియోగించుకు న్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పున ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) కింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది.

చల్లబడిన వాతావరణం

- జిల్లా సగటున 18.7 శాతం వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రుతుపవనాల రాకతో జిల్లాలో గత రెండు రోజుల నుండి వర్షాలు పడటంతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం కాస్త చల్లబడింది. జిల్లాలో కొన్ని మండలాల్లో వర్షాలు పడగా, మరికొన్ని మండలాల్లో వర్షం పడలేదు. బుధవారం జిల్లాలో అత్యధికంగా డోన్ మండలంలో 109.2 మి.మీ, అత్యల్పంగా నంద్యాల మండలంలో 1.0 మి.మీ నమోదయింది. అలాగే ఉయ్యాలవాడ 67.6, సంజామల 60.8, చాగలమర్రి 58.0, నంది కొట్కూరు 28.4, అవుకు 28.2, బనగానపల్లె 22.4, వెలుగోడు 16.4, కోయిలకుంట్ల 16.2, పాణ్యం 15.8, జూపాడుబంగ్లా 15.4, దొర్నిపాడు, ఆత్మకూరు 15.2, ప్యాపిలి 13.2, కొత్తపల్లి 9.8, ఆళ్లగడ్డ 9.2, కొలిమిగుండ్ల 8.6, మిడ్తూరు 8.4, సిరివెళ్ల 7.4, పాములపాడు 4.8, రుద్రవరం 4.6, పగిడ్యాల 3.4, బండి ఆత్మకూరు 1.8, గోస్పాడు 1.4, బేతంచెర్ల 1.2 మి.మీ వర్షపాతం నమోదు అయింది. జిల్లా సగటున 18.7 మిల్లి మీటర్ల వర్షం కురిసింది.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను

రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - శ్రీశైలం

రాష్ట్రంలోని 2.95 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం శ్రీశైలంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏ నాటికైనా రెగ్యులర్ అవుతామన్న ఆశతో శ్రీశైలం దేవస్థానంతో సహా అనేక ధార్మిక సంస్థలలో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన అతి తక్కువ వేతనాలతో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారని తెలిపారు. 2014 జూన్ 2 నాటికి 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని మాత్రమే రెగ్యులరైజ్ చెయ్యాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో అనేక మంది తీవ్ర ఆందోళనకు, అసంతృప్తికి గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం అందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. డిశంబర్ 31, 2022 నాటికి పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఉద్యోగికి 3 లేదా 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి అయిన వెంటనే రెగ్యులర్ చేసేలా నిర్దిష్ట ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1993కు ముందు నుండి పని చేస్తున్న డైలీవేజ్, టైంస్కేల్, కంటింజెంట్ తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. పార్ట్ టైం, గెస్ట్ వ్యవస్థను ఫుల్‌టైంగా మార్చాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు శ్రీశైలం మండల కార్యదర్శి చిన్న మారెన్న, నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు యేసురత్నం, నాగరాజు

అందని ఉపాధి వేతనాలు

- ఐదు వారాలుగా పెండింగ్
- ఇబ్బందుల్లో కూలీలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో వలసలు నివారించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద వ్యవసాయ కూలీలకు పనులు కల్పిస్తున్నాయి. ఈ ఏడాది పలు గ్రామాల్లో పనులు కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి సిబ్బంది పనులు కల్పించారు. పనులు చేసిన కూలీలకు ఐదు వారాలుగా వేతనాలు చెల్లించడం లేదు. బిల్లులు పడకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కొత్తపల్లి మండలంలో ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి పలు గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించారు. మండలంలో సుమారు 4 వేల నుంచి 5 వేల మంది దాకా ఉపాధి కూలీలకు సుమారు 5 వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు ఒక కోటి 48 లక్షల రూపాయలు కూలీలకు వేతనాలు పడాల్సి ఉంది. ఉపాధి కూలీలు బిల్లులు ఎప్పుడు పడతాయోనని ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. ఒక వైపు ప్రభుత్వం మాత్రం ఆర్భాటంగా ఉన్న గ్రామాల్లోనే అడిగిన ప్రతి కూలికి ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించడంతో పాటు బిల్లులు కూడా వారం వారం పడతాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం బిల్లులు పడడం లేదు. పనులు ప్రారంభమైన కొన్ని రోజుల వరకు పనులు చేసిన వెంటనే వారం వారం బిల్లులు పడ్డాయి. ఆ తర్వాత సుమారు 5 వారాల నుంచి బిల్లులు పడకపోవడంతో బిల్లుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్ ఉపాధి బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించి కూలీలను ఆదుకోవాలి

గ్రామాల్లో ఉపాధి కూలీలకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలి. కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీలకు బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నారు. బిల్లుల చెల్లింపు ఆలస్యమైతే కూలీలతో కలిసి ఆందోళనలు చేపట్టాల్సి వస్తుంది. ప్రస్తుత ప్రభుత్వ నిబంధనలు కూలీలకు శాపంగా మారాయి. కుటుంబానికి వందరోజుల పని కాకుండా 200 రోజులు పని దినాలు కల్పించాలి.

- స్వాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.

సిఐని కలిసిన ఫొటోగ్రాఫర్లు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌కు నూతన సిఐగా వచ్చిన రమేష్ బాబును పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ల సంఘం తరపున ఫొటోగ్రాఫర్ సుబ్బరాయుడు సోదరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐకి పూలమాల వేసి, ఆయనకు చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

రక్త నమూనా పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు రక్త నమూన పరీక్షలపై గ్రామ ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. అలాగే మొక్కలు నాటి వాటిని సంరక్షించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాంబాబు, రాజశేఖర్, గౌస్, ఆళ్లగడ్డ వివేకానంద విశ్వమానవ సేవసమితి సభ్యులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పరిశ్రమపై యువతకు శిక్షణ

ప్రజాశక్తి - బనగానపల్లె : చిన్న కోళ్ల పరిశ్రమ ఏర్పాటుపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, యూనిట్ హెడ్ ధనలక్ష్మి, ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాప్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పరిశ్రమ ఏర్పాటుకు రెండు నెలల శిక్షణ ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ చదివి, 18 సంవత్సరాలు దాటిన వారికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు 9705998056, 8465925341 సంప్రదించాలని తెలిపారు.

క్విజ్ పోటీల్లో మోడల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో బనగానపల్లె మండల స్థాయిలో 'అఖిలభారత ఆర్థిక అక్షరాస్యత' అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ రామలక్ష్మి గురువారం తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థినులు ఎం.శివమణి నాయక్, కే.హరిణి ద్వితీయ బహుమతిగా 4 వేల రూపాయలు, ప్రశంసా పత్రం పొందారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మైనార్టీల సంక్షేమమే వైసిపి లక్ష్యం : ఎమ్మెల్యే

- టిడిపి నుంచి వైసిపిలోకి ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకుడు జిఎం.గౌస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముస్లిం మైనార్టీల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంద్యాలలోని శోభా లాడ్జిలో సీనియర్ ముస్లిం మైనార్టీ నాయకుడు జిఎం గౌస్ తన అభిమానులతో కలిసి టిడిపిని వీడి ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిఎం గౌస్ టిడిపి వీడి స్వచ్ఛంధంగా వైసిపిలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. నంద్యాల చరిత్రలో మొట్టమొదటిగా మైనార్టీ నాయకుడైన ఇసాక్ బాషాకు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పదవిని కల్పించామని, ప్రప్రథమంగా ముస్లిం మైనార్టీ మహిళ షేక్ మాబున్నీసాకు మున్సిపల్ చైర్మన్ అధికారాన్ని కల్పించిన ఘనత తమదేన్నారు. నంద్యాల బై ఎలక్షన్లో జగనన్న ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన మాట ప్రకారం మైనార్టీ నాయకుడైన ఇసాక్ బాషకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని తెలిపారు. సీనియర్ నాయకుడు జిఎం గౌస్‌కు తగిన గౌరవం, హోదా కల్పిస్తామన్నారు. అనంతరం జిఎం గౌస్ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భవించిన నాటి నుండి ముస్లిం మైనార్టీలకు ఆ పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పించలేదని, పార్టీని నమ్ముకున్న నాయకులను మోసం చేశారని పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు తగిన న్యాయం, సముచిత స్థానం దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ స్టేట్ ప్రసిడెంట్ మౌలానా అబ్దుల్ ఖదీర్, జమీయాతుల్ ఉలేమా స్టేట్ ప్రసిడెంట్ మౌలానా ఇలియాస్, ముస్లిం మైనార్టీ నాయకులు గన్నీకరీం, పార్థుడు, వైసిపి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిఎం గౌస్‌కు వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్

మైనారిటీల అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసిపి : టిడిపి

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, అధికార మదంతో ఊగిపోతున్న వైసిపి నాయకులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని టిడిపి రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలాన ముస్తాక్ అహ్మద్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు చేసిన ఆరోపణలను, అవాస్తవాలను తీవ్రంగా ఖండించారు. వక్ఫ్‌బోర్డ్ స్థలంలో నిర్మించిన మదరసాను పోలీసులు వైసిపి నాయకులకు వత్తాసు పలుకుతూ అక్రమంగా సీజ్ చేయడం బాధాకరమన్నారు. లంచాలకు అలవాటుపడ్డ వక్ఫ్‌బోర్డ్ అధికారులు వైసిపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. జామియా మజీద్ కమిటీలో ఎమ్మెల్సీ ఇసాక్ భాషా అక్రమంగా కొనసాగుతున్నారని ఆరోపించారు. నంద్యాలలో వక్ఫ్ స్థలం లీజ్‌కు తీసుకొని మదరసా, మసీదులను సొంత ఖర్చులతో అభివృద్ధి చేశానన్నారు. టిడిపిలో క్రియాశీలకంగా ఉన్నానని తనపై కక్షగట్టి వేధిస్తున్నారని ఆవేదన చెందారు. కోట్ల విలువైన వక్ఫ్ భూమిని హిందూజాకు కట్టబెట్టి దోచుకున్నది వైసిపి నాయకులేనని ఆరోపించారు. వైసిపి నాయకుడు ఖాదర్ బాషా, ఎమ్మెల్సీ ఇసాక్ భాష, స్థానిక ఎమ్మెల్యే శిల్పా పెద్ద గజ దొంగలని, వారు చేసే అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని విమర్శించారు. త్వరలో అవినీతి అక్రమాలను ఆధారాలతో సహా బహిర్గతం చేస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

విద్యార్థుల కోసం ఎస్‌ఎఫ్‌ఐ హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరుతున్న విద్యార్థుల కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం హెల్ప్‌డెస్క్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, సహాయ కార్యదర్శి మధు కిరణ్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌లు మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలల్లో చేరుటకు, వసతి గృహంలో ఉండేందుకు, వారికి అవసరమైన బస్ పాసులో ఇప్పించేందుకు అవసరమైన సలహాలు సూచనలు, అవసరమైన అప్లికేషన్లు ఫిలప్ చేసి అన్ని విధాలా సహకరించినట్లు తెలిపారు. పాఠశాల, కళాశాలలో చేరే విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం సహాయ సహకారాలు అందిస్తుందని, ఏమైనా అవసరమైతే 9553955647 ,7989377178 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

దరఖాస్తులు పూరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'జగనన్న సురక్ష' పథకం క్యాంపులను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ నియోజకవర్గ, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న సురక్ష పథకం అమలు తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామ వార్డుల్లో వాలంటీర్, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా రూపొందించిన యాప్‌లో ప్రజల సమస్యలను నమోదు చేసుకొని పరిష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంతకుముందు జగనన్న సురక్ష యాప్‌పై జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి సుదీర్ఘంగా వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ పుల్లయ్య, నియోజకవర్గాల స్పెషల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న బ్రహ్మానంద ఆచారి

పలుకూరు వాసికి 'గౌతమ బుద్ధ' పురస్కారం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన శ్రీ జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి గౌతమ బుద్ధ ఇంటర్నేషనల్ పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాదులోని బిల్లా హాల్‌లో మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి నిర్వహించిన కార్యక్రమంలో బ్రహ్మానంద ఆచారి సేవలు గుర్తించి అమెరికాకు చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు ఈమెన్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ చేతుల మీదుగా గౌతమ బుద్ధ ఇంటర్నేషనల్ పురస్కారం అందజేశారు. ఈ పురస్కారం ఇచ్చిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తికి బ్రహ్మానంద ఆచారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురస్కారం స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. ఇప్పటికే తమ సంస్థ 950 సేవా కార్యక్రమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత ఎంఆర్ చౌదరి, సినీ నటుడు ముఖేష్, ప్రముఖ డాక్టర్ వరప్రసాద్, దైవాజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

- డిప్యూటీ డిఇఒ మహమ్మద్ బేగ్

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలని డిప్యూటీ డిఇఒ మహమ్మద్ బేగ్ తెలిపారు. గురువారం రుద్రవరం మండలంలోని పలు పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. రుద్రవరం, నరసాపురం, పెద్ద కంబలూరు, ఎల్లావత్తుల ఉన్నత పాఠశాలలను, రెడ్డిపల్లి, మాచినేనిపల్లి, బి నాగిరెడ్డి, కొండమాయ పల్లి, చిన్నకంబలూరు ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. జగనన్న విద్య కానుకలో భాగంగా విద్యార్థులకు అందించిన విద్యకానుక కిట్లు అన్ని విద్యార్థులకు అందివనవి లేనివి పరిశీలించారు. విద్యార్థులతో యుద్ధ ప్రాతిపదికన ఆధార్ నమోదు వేయించడంపై పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఇఒలు కోటయ్యా, లక్ష్మీ, సిఆర్పి శ్రీనివాసులు, ఎంఐఎస్ శేఖర్, ఎంఆర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ

గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోపాల్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు హర్షణీయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని కొలుములపల్లి గ్రామం నివాసి అయిన నిజాం గారి గోపాల్‌కు జానపద కళాకారుడిగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం ఎంతో అభినందనీయమని బేతంచెర్ల మండలం వైసిపి సీనియర్ నాయకులు బాబు రెడ్డి అన్నారు. నిజాం గారి గోపాల్ అలియాస్ రేలారే రేలా గోపాల్ సొంతంగా యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి కావడం తో రేలారే రేలా గోపాల్ వాల్ పోస్టర్లు వైసిపి నాయకులు రెడ్డి చేతుల మీదుగా గురువారం నాడు బేతంచర్ల పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలో గల శ్రీ శేషసాయి కాంప్లెక్స్ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ బేతంచెర్ల మండలం పల్లి గ్రామానికి చెందిన రేలారే రేలా గోపాల్ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం బేతంచర్ల మండలానికి గర్వకారణం అని ఆయన అన్నారు. రేలారే రేలా గోపాల్ భవిష్యత్తులో మంచి క్రమశిక్షణతో అంచలంచలుగా ఎదిగి జిల్లాకే కాకుండా రాష్ట్రానికి పేరు తేవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గన కుమార్ రెడ్డి, సూర్య బల్లాని, సూరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ శ్రీనివాస్ రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హెల్త్ అలవెన్స్, పిఎఫ్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, హెల్త్ అలవెన్స్ సమస్యను పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు, జోసఫ్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కోవిడ్ వారియర్స్‌గా ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ప్రాణాలకు తెగించి సేవ చేసిన వీరికి 010 పద్ధతి ద్వారా జీతాలు చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, సంక్షేమ పథకాలు, సిపిఎస్ రద్దు చేయాలన్నారు. హెల్త్ అలవెన్స్ నెలనెల కార్మికుని అకౌంట్‌లో నేరుగా జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు సురేష్, రవి, వినోద్, రాజేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సబ్ రిజిస్టర్

సబ్ రిజిస్టార్ భవన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలో ఉన్న అతి పురాతనమైన సబ్ రిజిస్టర్ కార్యాలయ భవనం స్థానంలో నూతన భవనాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని జిల్లా సబ్ రిజిస్టర్ అధికారి చెన్నకేశవరెడ్డి అన్నారు. గురువారం అవుకు పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను, కార్యాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే రిజిస్టర్లు జరగాలని అధికారులకు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్న కార్యాలయ భవనం సుమారు 100 సంవత్సరములు దాటిందని ఈ భవనం పూర్తిగా శిథిలం కావడం చూసానని ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి త్వరలోనే నూతన భవనాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అవుకు సబ్ రిజిస్టర్ హాజినియా, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

ముంపు బాధితుల పరిహారానికి వివరాలు సేకరణ

ప్రజాశక్తి - పాములపాడు

శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నీటిమంపు నిర్వాసితుల పరిహారం కొరకై పాములపాడు మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో అధికారులు గురువారం వివరాల సేకరణ నిర్వహించారు. ఈ సేకరణకు వచ్చిన డిప్యూటీ తాసిల్దారులు విజయలక్ష్మి, శ్రీ రాధా మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నీటిముంపులో మొత్తం ఆరు మండలాలలో 33 గ్రామాల కు సంబంధించి 4523 మంది భూమిని కోల్పోయిన వారు ఉన్నారని అందులో 1000 మందికి సెటిల్మెంట్ జరిగిందన్నారు. ఇప్పటివరకు పరిహారం అందని వారికి నోటీసులు ఇచ్చి వివరాలు సేకరించడం జరుగు తుందన్నారు. పాములపాడు మండలంలో 146 మందికి నోటీసులు ఇవ్వగా 70 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు రాజేశ్వరి, రాధమ్మ, లక్ష్మి రెడ్డి పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై చర్యలు

- ఇరిగేషన్ ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, మట్టి రవాణా చేసిన వాహనాలను సీజ్ చేస్తామని నీటి పారుదల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై నిఘా ఉంచాలానే ఉద్దేశ్యంతో ఇటీవల కాలంలోనే జిల్లా కలెక్టర్ అక్రమ టాస్క్ పోర్స్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. చిన్న చెరువులో రాత్రి పూట కొంతమంది అక్రమంగా మట్టి తవ్వుతుంటే పోలీసుల సహకారంతో 3 ట్రాక్టర్లు, జెసిబిని సీజ్ చేశామన్నారు. కెసి కెనాల్ పరిధిలోని నంద్యాల పెద్ద చెరువు, చిన్న చెరువు, కానాల చెరువు, కుందూ నదులలో అక్రమంగా మట్టి తీసుకుపోవడానికి వీలు లేదన్నారు. రైతులకు మట్టి అవసరమయితే క్యూబిక్ మీటర్‌కు ఒక్క రూపాయి ప్రభుత్వానికి చలానా కట్టి ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకోని తీసుకెళ్లాలని సూచించారు.

ట్రూఅప్ చార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్ : పెంచిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఉపసంహరిం చుకోవాలని, విద్యుత్ డిస్కంలను ప్రైవేటుకరించరాదని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఏ. రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, రజాక్‌లు మాట్లా డుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందుకు ప్రజల పైన విద్యుత్ చార్జీల భారం మోపబోమని ప్రజలకు నిత్యం కరెంటు ఉండేలా చూస్తామని ఉచిత కరెంటు సరఫరా చేస్తామని, రైతులకు నష్టం కలిగించే ఏ చర్యలను చేపట్టబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల కాలంలో రూ.17వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజల పైన మోపడం దుర్మార్గం అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వకుండా మోసం చేశారని, స్మార్ట్ మీటర్ల పేరుతో ఆదానికి లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ డిస్కంలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజల పైన పెద్ద ఎత్తున భారాలను మోపడమే ధ్యేయంగా పెట్టుకుందన్నారు. మోడీకి అను కూలంగా వ్యవహరిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రాబోయే కాలంలో ప్రజలంతా కరెంటు షాకు ఇస్తారని అన్నారు. నంద్యాల పట్టణంలోని అన్ని వార్డులోని ప్రజలను కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా సంతకాలను సేకరిస్తామన్నారు. ప్రతి అపార్ట్మెంట్ కు వెళ్లి కరెంటు చార్జీల భారాన్ని వివరించి ప్రభుత్వ విధానా లను ప్రజల్లోకి తీసుకువెళ్తామని అన్నారు. ఈనెల 30వ విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. సిపిఎం నాయకులు మాబాష, డి. రామ్ నాయక్, ఏ. సురేంద్ర, ఎన్. స్వాములు, సద్దాం హుసేన్, వీరన్న, మహమ్మద్, గణపతి, రాజేష్, సామెలు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ నిర్వహిస్తున్న నిర్వహించిన డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కాంతారావు

మెరుగైన వైద్యం అందించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లి లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాల పరిసర ప్రాంతాలను వైద్యశాలలో ఉన్న పలు రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి వైద్యాధికారి బాధ్యతగా రోగుల పట్ల జాగ్రత్తలు తీసుకొని వైద్యం చేయాలన్నారు. ఈ మండలంలో ఎక్కువ శాతం గిరిజనులు ఉన్నప్పటికీ సంబంధిత వైద్య వైద్యాధికారులు వైద్య సిబ్బంది గిరిజనుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి గిరిజనులు అనారోగ్యాల బారిన పడకుండా చూడాలన్నారు. అలాగే చెంచు గూడెంలకు వైద్యాధికారులు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని చెంచు గూడెంలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే వైద్యశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు పరీక్షలు పరీక్షలు చేయాలన్నారు. ఈ తనిఖీల్లో కొత్తపల్లి వైద్యాధికారులు వినోద్ కుమార్, దీప నాగవేణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీలు

ఆత్మకూర్: నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కాంతారావు నాయక్ గురువారం నాడు ఆత్మకూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెల్త్ వెల్నెస్ సెంటర్, కురుకుంద గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ అంగన్వాడి సెంటర్‌ల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యులకు అందుబాటులో గల పరీక్షలను మందులను ఎన్‌సిడి, సిడి పేషెంట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కురుకుంద జిల్లా పరిషత్ హైస్కూల్ నందు పిల్లలకు రక్తహీనతపై సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడి కేంద్రం దర్శించి వైద్య సేవలు గురించి క్షుణ్ణంగా పరీక్షించాడు. ఈ కార్యక్రమంలో కల్లూరి పెద్ద మస్తానయ్య, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆర్‌టిసి బస్సూ సున్నిపెంటకు రావాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆంధ్ర రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి ఆర్టిసి ప్రతి బస్సు సుండి పెంట బస్టాండ్‌కు రావాలని ఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదం డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్లో మాట్లాడుతూ గతంలో ప్రతి ఆర్టీసీ బస్సు సున్నిపెంటకు వస్తుంటాయని ఈ మధ్యకాలంలో విజయవాడ, గుంటూరు, తెనాలి, రాజమండ్రి, మంగళగిరి ఆర్టీసీ బస్సులు సుండి పెంటకు రాకుండా నేరుగా

మాట్లాడుతున్న ఐఎఫ్టియు నాయకులు

శ్రీశైలం వెళ్లడం వలన సుండి పెంట కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే గతంలో అనేకసార్లు ఆర్టీసీ వారికి ఈ విషయాన్ని వారి ఆర్ఎం దృష్టికి తీసుకొని పోయామని అయినప్పటికీ ఆర్టీసీ డ్రైవర్లు ఏమాత్రం విషయాన్ని పెడచెవిన పెడుతూ సున్నిపెంటకు రాకుండా నేరుగా శ్రీశైలం వెళ్లడం అలవాటయిపోయిందన్నారు. ప్రధానం గా అమరావతి రాజధాని నుండి విజయవాడ, గుంటూరు,మంగళగిరి, తెనాలి ప్రాంతం బస్సులు అధికంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వస్తుంటాయని బస్సు డ్రైవర్లు మాత్రము సుండి పెంటకు పోవని దోర్నాలలో వదిలేయడం వలన మహిళలు,చిన్నపిల్లలు వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారని రాయలసీమ నుండి రాత్రి వేళలో వచ్చే మడకశిర కర్ణాటక బస్సులు సుండిపెంట రాకుండా నేరుగా శ్రీశైలం వెళ్తున్నాయని అన్నారు. అనేక ప్రాంతాల నుండి సున్నిపెంటకు వస్తుంటారు వారిని వేలగాని వేళలో ముఖద్వారం వద్ద వేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని కార్మిక సంఘాలు తరపున ఎన్నోసార్లు ఆర్ఎం దృష్టిలకు తీసుకెళ్లిన తనిఖీలతో కాలయాపన చేస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే ముఖద్వారం వద్ద ప్రజలను కూడా కట్టుకొని ధర్నాలు చేస్తామని తెలిపారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున ఏడిఏ ఆంజనేయులు

కౌలు కార్డులపై అవగాహన

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండలంలోని శ్రీపతిరావు పేట ఆత్మకూరు రైతు భరోసా కేంద్రం నందు కౌలు కార్డులపై రైతులకు గురువారం నాడు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాల కులు ఆంజనేయ, మండల వ్యవసాయశాఖ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలుకు సాగు చేస్తున్న రైతులు సిసిఆర్‌సి కార్డు లేదా పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని అన్నారు. సిసిఆర్సి కార్డు ఉంటేనే సబ్సిడీ, తదితర పథకాలు కౌలు రైతుకు వర్తిస్తాయని తెలిపారు. వివరాలకు ఆర్‌బికెల్లో అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

బేతంచెర్ల: కౌలు రైతులు కౌలు పత్రములు కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రంలో గానీ గ్రామ రెవెన్యూ అధికారి దగ్గర దరఖాస్తు చేసుకోవాలని బేతంచెర్ల మండలం అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ అన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : చైర్మన్

- కాలనీల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ పటణంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ వెంటనే స్పందించారు. గురువారం ఉదయం నల్లగుట్ట, వైఎస్ నగర్, రైల్వే కాలనీ ప్రాంతాల్లో ఆయన పర్యటన చేశారు. ఎక్కడెక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ఆయన పర్యటనలో గుర్తించిన అంశాలను అధికారుల దృష్టికి తెచ్చారు. భారీ వర్షానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులకు , సిబ్బందికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలు పాడైపోయాయని, కొత్త కాలువలు త్వరలో వేస్తామని తెలిపారు. కొన్ని చోట్ల టౌన్‌ప్లానింగ్ అనుమతి లేకుండా అక్రమంగా ఇల్లు కట్టుకోవడంతో కాలువల సమస్య ఏర్పడిందని తెలిపారు. వాటిని క్రమబద్ధీకరించి సమస్యలు రాకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా బిసి అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్ , కౌన్సిలర్ శరత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఆర్థిక సాయం కింద పోస్ట్ ప్రసాద్ కొంత డబ్బును బాధితులకు అందజేశారు.

వర్షానికి దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

టిడిపితోనే అభివృద్ధి

టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-డోన్

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం డోన్ మండ లంలోని యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలోకి డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రణాళిక లేని పాలనతో ప్రజలు విసుగు చెందారని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం వైసిపి నుండి టిడిపి లోకి చేరిన మనోహర్,బంధ్య నవాజ్, కాజా, మౌలాలి, రామానాయుడు, మధు, లక్ష్మణ్, మధు కుమార్, మద్దయ్య, సత్యం నాయుడు, కృష్ణ, చిన్న, మధు, ఉదయ్, చంద్ర గౌడ్, సూర్యనారాయణ, మంజునాథలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు,డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు,క్లస్టర్ ఇంచార్జ్ గోవిందు, గోపాల్,బద్రి, మాధవ కృష్ణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి లోకి నేతలను ఆహ్వానిస్తున్న సుబ్బారెడ్డి

నేడు సంజామలకు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - సంజామల

మండల పరిధిలోని నర్సం గ్రామానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు గ్రామానికి వస్తున్నట్లు ఆ గ్రామ నాయకుడు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్లికి రెడ్డి వెంకటసుబ్బారెడ్డి గురువారం తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు గ్రామానికి రావాలని ఆయన తెలిపారు.

నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామాలలో అక్రమ మైనింగ్, నకిలీ విత్తనాలు నకిలీ ఎరువులు విత్తనాల బ్లాక్ మార్కెట్ వంటి వాటిపై తక్షణమే స్పందించి పై అధికారుల దృష్టికి తేవాలని తాసీల్దార్ రత్న రాధిక అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం నందు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు వీఆర్వోలకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ వీఎఎ, విఆర్ఓ, ఎమ్మెస్కే కమిటీగా ఉంటారని మండలంలో తాసీల్దార్, ఏవో, ఎంపీడీవో,ఎస్సై మండల టాస్క్‌ఫోర్స్‌గా ఉంటారని ఆమె తెలిపారు. గ్రామస్థాయిలో విధి నిర్వహణ టైంలో కాకుండా ఏ టైంలో నైనా రాత్రిపూటైనా అక్రమ మట్టి తవ్వకం వంటి వాటిపై స్పందించి తక్షణమే మండల కమిటీకి తెలియ పరచాలన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులపై కూడా అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని మల్లెవేముల గ్రామంలోని సచివాలయాన్ని ఎంపీడీవో మహబూబ్ దౌలా గురువారం తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు దస్త్రాలను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ సరోజమ్మ అధ్యక్షతన సచి వాలయ సిబ్బంది వాలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డి సుదర్శన్ రావు, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - మహానంది



మండలంలోని యు. బొల్లవరం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిం చాలని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ముస్లిం కాలనీలో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని నీరు సక్రమంగా రావడం లేదని, అధికారులకు తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు వాపోయారు. అంగన్వాడి కేంద్రం దగ్గర ఉన్న చేతి పంపు పని చేయడం లేదని ఫిర్యాదు చేసి స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యు. బొల్లవరం గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని 4వ సచివాలయంలో గురువారం నూతన ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఓ మహబూబ్‌దౌలా, ఇన్‌చార్జ్ ఈఓ ఆర్‌డి సుదర్శన్ రావులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ స్థానిక సచివాలయంలో కార్యాలయ పనివేళలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కొత్త ఆధార్ కార్డు,ఆధార్‌లో పేర్ల మార్పులు,చేర్పులు,తదితర సేవలకై ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ కోరారు.

ఈకార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మనోజ్, డిఏ కిరణ్,జిఎంఎస్‌కె శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓ సుభాన్

పకడ్బందీగా జెవికె కిట్లు పంపిణీ : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిద్యాల

పకడ్బందీగా జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంఈఓ సుభాన్ తెలిపారు. గురువారం బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో. కె పాలమరి గ్రామంలో ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు బయోమెట్రిక్ ద్వారా జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి కోసం పోరుబాట : సిపిఐ

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం జూలైలో పోరుబాట చేయనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి రంగయ్య నాయుడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించా లని తదితర జులైలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

హెడ్ రెగ్యులేటర్ వద్ద పరిశీలిస్తున్న కడప ఎస్సి హరి నారాయణ రెడ్డి

30 వేల క్యూసెక్కులు తరలిస్తాం : ఎస్ఇ

ప్రజాశక్తి - అవుకు

అవుకు రిజర్వాయర్ నుండి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా కడప జిల్లాకు 30 వేల క్యూసెక్కుల నీటిని తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కడప జిల్లా ఎస్ఇ హరినారాయణ రెడ్డి తెలిపారు. గురువారం అవుకు రిజర్వాయర్ వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్ గేట్ల వద్ద ఉన్న కాల్వ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. కడప జిల్లా అడిషనల్ ఎస్సీ ఇలియాస్ బాష, ఈఈలు రాధాకృష్ణ, శ్రీరామ్ నాయక్‌లతో కలిసి అవుకు రిజర్వాయర్ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిఎన్ఎస్ఎస్ కాలువ నిర్మాణ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గండికోట వద్ద నిర్మిస్తున్న టన్నెల్ ఇప్పటికే 50 శాతం పూర్తయిందని త్వరలోనే పనులను వేగవంతం చేసి మిగిలిన శాతం పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అవుకు ఎస్ఆర్బిసి ఈ సురేష్, డిఈ బాబ్జి, రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

చిన్నబాబు ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - వెలుగోడు

దళిత చిన్నబాబు ఆత్మహత్యకు కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వెలుగోడు సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి నాగ మోహన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో తోట లైనుకు చెందిన చిన్నబాబును నంద్యాల వన్ టౌన్ పోలీసులు హింసించడంతోనే ఆత్మహత్య చేసుకుడని అన్నారు. చిన్న బాబు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి, నంద్యాల టౌన్ లో ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్ల పాలనలో దాదాపుగా 200 మంది దళితులు ఆత్మహత్యకు, హత్యలకు కారణమైందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దళితులపైన జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ నాయకులు వెంకటయ్య, దర్గయ్య, నాగేంద్ర, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికె అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆత్మకూర్

కౌలు రైతు, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, ఏపీ రైతు సంఘం మండల కార్య దర్శి ఎన్ వీరన్నలు అన్నారు. ఈ మేరకు గురువారం నాడు బాపనంతా పురం రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసా కేంద్రం అధికారి రాజమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, వాణిజ్య పంటలకు రూ.25వేలు ఇవ్వాలని, హైవే రోడ్డు 167 నంద్యాల కల్వకుర్తి రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారము నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని, ఈ క్రాఫ్ కౌలుదారు పేరుతోనే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాముడు, రైతులు లక్ష్మన్న, వెంకటేశ్వర్లు, కౌలు రైతులు శ్రీను, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

ప్రజాశక్తి - ఆత్మకూర్

జగనన్న సురక్ష కార్యక్రమంపై మండలంలో విస్తృతంగా అవగాహన కల్పించారు. గురువారం నాడు ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో ఆత్మకూరు మండలంలోని శ్రీపతి రావు పేట, వడ్ల రామాపురం, కురుకుంద, కొటాల్ చెరువు కరివేన గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఆత్మకూర్ మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, జెసిఎస్ సుల్తాన్, కమిషనర్ శ్రీనివాసరావు, మండల జేసిఎస్ కన్వీనర్ రాజమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా అందించే 11 రకాల సేవలను గురించి వివరించారు.

మహానంది : జగనన్న సురక్ష కార్యక్రమంపై మండలంలోని అబ్బీపురం, తిమ్మాపురం, మహానంది, గ్రామాల్లోని సచివాలయాల్లో జడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ జనార్ధన్ శెట్టి, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు సహకారాలు అందిస్తాం

- మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్

ప్రజాశక్తి-డోన్

ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందిస్తామని డోన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ పేర్కొన్నారు. గురువారం డోన్ ఆవోపా ద్వారా కొత్తూరు నారాయణ సతీమణికి డోన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, పద్మజ దంపతుల కుమార్తె మహతి సౌజన్యంతో నిత్యవసర సరుకులు అందజేశారు.

కొత్తూరు నారాయణ సతీమణికి నిత్యవసర సరుకులు అందిస్తున్న ఆవోపా సంఘం సభ్యులు